


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 225 | ఆదివారం 17- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ

### : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ అని ఆయన ప్రసంగం మరో సారి రుజువు చేసింది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ హయంలో హైదరాబాద్ నిర్మాణ రంగం ఎందుకు పురోగతిలో ఉంది.. రేవంత్ హయంలో ఎందుకు దిగజారిందో ఆలోచించాలి అని శ్రవణ్ సూచించారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. పంద్రాగస్టు సందర్భంగా గోల్కొండలో, క్రెడాయక్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పసలేని ప్రసంగాలు చేశారు.

## తెలుగు రాష్ట్రాలు రెండు కళ్లన్నావు ఏమాయె..

### చంద్రబాబుకు ఎమ్మెల్సీ అద్దంకి కౌంటర్



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బనకచర్లపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ పాలిటిక్స్‌లో కాకపుట్టిస్తున్నాయి. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు. మాట్లాడితే తెలుగు రాష్ట్రాలు తనకు రెండు కళ్లని చెప్పే చంద్రబాబు.. తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరగుతుంటే ఎందుకు మాట్లాడరని కామెంట్ చేశారు.



- పదవిని పగ కోసం వాడితే తనకన్నా మూర్ఖుడు మరొకరు ఉండరు
- నిజమైన ఉద్యమకారులు లక్ష్యాన్ని కోల్పోరు, కోట్ల సంపాదనతో ఉద్యమమా?
- అద్దాల మేడలు అభివృద్ధి కాదు, సంక్షేమమే అసలైన విజయం
- పేరు, పేగు బంధాలు తృజించి వ్యక్తిగత దురాశ కోసం తెలంగాణను వదిలారు
- శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక తత్వవేత్త.. పోరాటానికి స్ఫూర్తి తెలంగాణ నేల
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం

# వ్యక్తిగత పగ కోసం పదవిని వాడను..

## శత్రువులకు నా గెలుపే అసలైన శిక్ష

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తాను శత్రువుగా చూడాలన్నా ఆ వ్యక్తికి అంతటి స్థాయి ఉండాలని చెప్పారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూరు?డు ఇంకొకరు ఉండరని చెప్పారు. శత్రువులకు తన గెలుపే అసలైన శిక్ష అని అన్నారు. తాను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానన్న సీఎం రేవంత్.. ఎవడి పాపాలకు వాడే బలైపోతారని చెప్పారు.

అందెశ్రీ రాసిన హసిత బాష్పాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. అద్దాల మేడలు అభివృద్ధి కాదని.. సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరినప్పుడే అసలైన విజయం అని అన్నారు. నిజమైన ఉద్యమకారులెవరూ ఉద్యమకారుడినని చెప్పుకోరని..సర్వం కోల్పోయినా లక్ష్యం వైపు వెళ్తారని చెప్పారు రేవంత్. ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణతో పేగు బంధం,పేరు బంధం అన్ని తెంచుకున్నారని విమర్శించారు.

## స్వాతంత్ర్యాన్ని అవమానించేలా ప్రధాని మోడీ ప్రసంగం - సీపీఐ నారాయణ



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట వద్ద ప్రధాని మోడీ చేసిన ప్రసంగం దేశ స్వాతంత్ర్యాన్ని అవమానించేలా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. ఆ మేరకు ఆయన శనివారం ఒక వీడియో విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశమంతా పండగ వాతావరణంలో ఉత్సవాలు చేసికొంటుంటే ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య పోరాటాన్ని అవమాన పరిచే విధంగా ఉందన్నారు.

## మొద్దు నిద్రలో రేవంత్ సర్కార్



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్క యూరియా బస్తా కోసం నిద్రాహారాలు మాని రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. భారీ క్యూలైన్‌లో నిల్చున్నప్పటికీ చివరి రైతు వరకు దొరుకుతుందో.. దొరకదో తెలియని అయోమయ పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది.



## కాంగ్రెస్ - బీజేపీ కుట్రతో కాళేశ్వరం కూల్చివేత

- మేడిగడ్డ పేలుళ్ల వెనుక రేవంత్, కిషన్ రెడ్డి ఉన్నారన్న అనుమానం
- కేసీఆర్‌ను బద్నాం చేయడానికే స్క్రిప్ట్ ప్రకారం ప్రాజెక్ట్ ధ్వంసం
- మేడిగడ్డ ఘటనపై ఎన్డీఎస్ఏ విచారణ ఒక్క రోజులోనే ఎందుకు?: కేంద్రంపై ప్రశ్నలు
- అసాంఘీక శక్తుల కుట్రలో కాంగ్రెస్, బీజేపీలే భాగస్వాములు: రేవంత్‌పై సంచలన వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

## రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారు.. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని అన్నారు. ఇప్పటికే తాను క్షమశిక్షణ కమిటీని ఆదేశించాను.. ముందు రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అతి త్వరలోనే రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని చెప్పారు.



## బిహార్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్.. రాహుల్ గాంధీ ఓటు అధికార్ యాత్ర..!

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నేపథ్యంలో కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 17 నుంచి బిహార్‌లో ఓటు అధికార్ యాత్ర చేపట్టనున్నారు.



## సరోగసి ముసుగులో శిశు కొనుగోలు


- నేరాన్ని అంగీకరించిన డాక్టర్ నమ్రత
- కన్ఫెషన్ రిపోర్ట్‌లో సంచలన వాస్తవాలు
- జయంతి కృష్ణ సహకారంతో అక్రమాలు
- ఏజెంట్ల ద్వారా గర్భిణీలను లొంగదీసి.. శిశువులను అమ్మకం



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితురాలు డాక్టర్ నమ్రత తన నేరాన్ని అంగీకరించారు. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. నమ్రత కన్ఫెషన్ రిపోర్ట్‌లో సెన్సేషన్ విషయాలు నమోదు చేశారు. 1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్ స్థాపించానని, 2007లో సికింద్రాబాద్‌లో రెండో బ్రాంచ్ ఓపెన్ చేశానని తెలిపారు. ఆ తర్వాత విశాఖలోను మరో ఫర్టిలిటీ సెంటర్ ప్రారంభించానని, తనకు రెండవ కుమారుడు జయంతి కృష్ణ న్యాయవాదిగా ఉంటూ సహకరించేవాడని నేరాంగీకార పత్రంలో పేర్కొన్నారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అదే ఉత్తమ మార్గం : ట్రంప్

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తన 'ట్రూత్ సోషల్ ' వేదికగా ఆయన కీలక ప్రకటన చేశారు. ఆ రెండు దేశాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమమార్గంగా పేర్కొన్నారు. కాల్పుల విరమణ నిలబడే అవకాశాలు తక్కువేనని చెప్పారు.



## కాళేశ్వరం ఒక నీతి, పోలవరానికి మరో నీతా?

- పోలవరం కాఫర్ డ్యామ్.. రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా..?
- పోలవరాన్ని 'కూలవరం' అనేసే ధైర్యం బీజేపీ-కాంగ్రెస్ నేతలకుందా?
- ఎన్నికల వేళ మేడిగడ్డపై బురదజల్లి, పోలవరం వైఫల్యాన్ని దాచేసారా?
- కాళేశ్వరం తెలంగాణకు జీవనాడి.. కంటికెర్రగా కాపాడుకుంటాం – కేటీఆర్



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

# మొద్దు నిద్రలో రేవంత్ సర్కార్ : హరీశ్‌రావు

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్క యూరియా బస్తా కోసం నిద్రాహారాలు మాని రైతులు వ్యవసాయ సహకార సంఘాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. భారీ క్యూలైన్‌లో నిల్చున్నప్పటికీ చివరి రైతు వరకు దొరుకుతుందో.. దొరకదో తెలియని అయోమయ పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది.

మహబూబాబాద్ జిల్లా గూడూరులో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థకు సంబంధించిన వీడియోను మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ముసురు వానలో రైతన్నలు రోడ్డెక్కితే.. రేవంత్ సర్కార్ మాత్రం మొద్దు నిద్రలో ఉందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో అన్నదాత కలత చెందుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. యూరియా కూడా సరఫరా చేయలేని దిక్కుమాలిన ప్రజాపాలన ఇది అని నిప్పులు చెరిగారు. అభయహస్తం కాదు.. రైతన్నల పాలిట భస్మాసుర హస్తం అయ్యింది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు విమర్శించారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అదే ఉత్తమ మార్గం : ట్రంప్

మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా జెలెన్‌స్కీ అమెరికా పర్యటనను ట్రంప్ ధ్రువీకరించారు. పుతిన్‌తో తాజా చర్చల విషయాన్ని ప్రస్తావించారు. 'అలాస్కాలో ఇదొక గొప్ప, విజయవంతమైన రోజు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం చాలాబాగా జరిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో సెక్రెటరీ జనరల్ ఇతర ఐరోపా నేతలతో ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందానికి వెళ్లడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా ఓ నిర్ణయానికి వచ్చాం. కాల్పుల విరమణ తరచూ ఉల్లంఘనలకు గురయ్యే అవకాశం ఉంది. జెలెన్‌స్కీ సోమవారం ఓవల్ కార్యాలయానికి రానున్నారు. అన్ని సవ్యంగా సాగితే పుతిన్‌తో సమావేశాన్ని షెడ్యూల్ చేస్తాం. తద్వారా లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు.

దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ట్రంప్, పుతిన్ మధ్య జరిగిన ఈ సమావేశాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనించాయి. భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయని ట్రంప్ తెలిపారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని తెలిపారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్‌పై సంతకం చేసేవరకు ఒప్పందం జరగదన్నారు.

# బిహార్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్.. రాహుల్ గాంధీ ఓటు అధికార్ యాత్ర..!



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నేపథ్యంలో కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 17 నుంచి బిహార్‌లో ఓటు అధికార్ యాత్ర చేపట్టనున్నారు. రాహుల్ 16 రోజుల పాటు 24 జిల్లాల్లోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన కొనసాగుతుందని ఎంపీ అఖిలేష్ సింగ్ తెలిపారు. ఈ మేరకు అన్ని సన్నాహాలను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రూ.1,300 కిలోమీటర్ల పొడవైన 16 రోజుల ప్రయాణం బీహార్‌లోని దాదాపు 25 జిల్లాల గుండా సాగనున్నది. అఖిల భారత కూటమిలోని అన్ని పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ సైతం రాహుల్‌తో కలిసి యాత్రలో పాల్గొంటారు. రాహుల్ గాంధీ దేశంలో ఓటును బలోపేతం చేయడానికి బయలుదేరారని కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటర్లను బలోపేతం చేయడానికి రాహుల్ గాంధీ ఓటర్ల హక్కుల యాత్రను చేపడుతున్నారు. ఆయన ప్రజా కోర్టుకు చేరుకుని, భారత రాజ్యాంగాన్ని బలోపేతం చేయాలంటే, ఇక్కడి ఓటర్లను బలోపేతం చేయాలని ప్రజలకు చెబుతారు. బీహార్‌లో ఓటర్ల జాబితాలో సవరణకు వ్యతిరేకంగా, ఓటర్ల చోరీకి వ్యతిరేకంగా పోరాటం ఒక ప్రజా ఉద్యమంగా మార్చడానికి యాత్ర జరుగుతోందని ఆయన అన్నారు. యాత్ర రోహ్తాస్ నుంచి మొదలై.. సెప్టెంబర్ ఒకటిన పాట్నాకు చేరుకుంటుందని వివరించారు.

# స్వాతంత్ర్యాన్ని అవమానించేలా ప్రధాని మోడీ ప్రసంగం - సీపీఐ నారాయణ

మొదటి పేజీ తరువాయి

స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ద్రోహం చేసే విధంగా ప్రధాని మోడీ మాట్లాడడం భారత ప్రజలను అవమానపరచడమేనని తెలిపారు.

1925లో సీపీఐ, ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని తెలిపారు. ఆనాటి నుంచి బ్రిటిష్ పాలనాకు వ్యతిరేకంగా సీపీఐ, ఇతర దేశభక్తులందరు ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. తుపాకీ గుండ్లకు బలయ్యారని, తూటాలకు లాఠీలకు ఎదురొడ్డారని పేర్కొన్నారు. కానీ ఆర్ఎస్ఎస్ నాయకులు స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఏక్కడైనా పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. లాఠీలకు తూటాలకు గురయ్యారా? ఉంటే ఒక పేరు అయిన చెప్పగలరా? అని ప్రశ్నించారు. సావర్కర్ అండమాన్ జైలులో నుంచి బ్రిటీష్ పాలనకు లొంగిపోయి క్షమాపణ చెప్పి బయటికి వచ్చి, ఆర్ఎస్ఎస్ వాళ్లని బ్రిటిష్ ఉద్యమంలో పాల్గొనవద్దని ఆదేశించడం వాస్తవం కదా ? అని ప్రశ్నించారు. అలాంటి చరిత్ర కలిగిన సావర్కర్, ఆర్ఎస్ఎస్‌ను పొగడడమంటే అంతకన్నా మించిన దేశద్రోహం ఇంకొకటి ఉంటుందా? అని ప్రశ్నించారు.

# 50 ఏళ్లుగా లేని కండిషన్లు ఇప్పుడే ఎందుకు?

## ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** ఫిల్మ్ ఫెడరేషన్ వేతనాల నిరసన 13 రోజులకు చేరుకుందని, కానీ నిర్మాతలు సంప్రదింపుల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. మేము చర్చలకు ఒప్పుకోవట్లేదని నిర్మాతలు బయట మాట్లాడుతున్నారని ఆరోపించారు. మమ్మల్ని మీడియా ముందు మాట్లాడవద్దు అని నిర్మాతలు నిన్న ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారని అన్నారు. మేము మాత్రం మూడు రోజుల నుంచి కూడా మీడియా ముందుకు రావడం లేదని, సైలెంట్‌గా ఉన్నామని తెలిపారు. 50 ఏళ్ల నుంచి లేని కండిషన్లు నిర్మాతలు ఇప్పుడు పెడుతున్నారని, వేతనాల పెంపు టాపిక్‌ను వాళ్లు డైవర్షన్ చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు.నిర్మాతలు కూడా కష్టాల్లో ఉన్నారు కాబట్టి మేము కూడా కొంత దిగి వస్తామని స్పష్టం చేశారు. మేము చర్చలకు సిద్ధంగానే ఉన్నాము.. కానీ నిర్మాతలు ఎవరు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. కరెక్ట్‌గా వేతనాల సమస్య వచ్చే సరికి ఎక్కడెక్కడ లేని పాయింట్స్ మాట్లాడుతున్నారని అన్నారు. మా కష్టానికి ప్రతిఫలాన్ని అడుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతం గురించి మీరు మాట్లాడితే మేము కూడా మాట్లాడాల్సి వస్తుందని, వారి నిర్ణయం చెప్తే.. మా కార్యాచరణ మేము ప్రకటిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కాంగ్రెస్ - బీజేపీ కుట్రతో కాళేశ్వరం కూల్చివేత

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కుట్ర ప్రకారం కూల్చివేశాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేలుళ్ళు వెనుక రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉన్నారన్న అనుమానం ఉందన్నారు. మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుకు కారణం బీజేపీ, కాంగ్రెస్ లే కారణమని ఆరోపించారు. రేవంత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు.. వారి అనుచరుల ఫోన్ కాల్స్ టేడాను బయటకు తీయాలన్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ చుట్టు ప్రక్కల ఫోన్ కాల్స్ డీటైల్స్ బయటకు తీయాలని.. మేడిగడ్డలో పిల్లర్ కుంగటంపై సిట్ విచారణ జరపాలని చెప్పింది. అక్టోబర్ 21, 2023న రవికాంత్ అనే ఇంజినీర్ అసిస్టెంట్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ ఎందుకు జరపడం లేదు? అని ప్రశ్నించారు. మేడిగడ్డ పిల్లర్ కు క్రాక్ ఎందుకు వచ్చిందో కాళేశ్వరం కమిషన్ నివేదికలో ఎందుకు చెప్పలేదు? అని నిలదీశారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే ప్రభుత్వం పీసీ ఘోష్ కమిషన్ వేసిందన్నారు. కిషన్ రెడ్డి ఆదేశాలతోనే ఒక్క రోజులోనే ఎన్డీఎస్ఏ మేడిగడ్డకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్‌ను బద్నాం చేయటానికి స్క్రిప్ట్ ప్రకారం కూల్చివేశారని.. మేడిగడ్డలో కుంగిన పిల్లర్ కు కావాలనే మరమ్మత్తులు చేయటం లేదని ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపించారు. "ఆంధ్ర పెట్టుబడిదారుల ప్రతినిధిగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. సీఎం రమేష్ కు వేల కోట్ల కాంట్రాక్టులు కట్టబెడుతున్నారు. మేడిగడ్డ దగ్గర జరిగిన పేల్లుళ్ళు వెనుకున్న అసాంఘీక శక్తులు కాంగ్రెస్, బీజేపీలే. బీఆర్ఎస్ హాయాంలో అప్పులపై ముఖ్యమంత్రి రేవంత్ అవాస్తవాలు చెప్పారని పార్లమెంట్ సాక్షిగా తేలింది. ప్రజాభవన్ లో బంగారు బాత్రూమ్ లు ఉన్నాయన్న భట్టి.. అదే భవన్ లో ఎలా ఉంటున్నారు." అని ఆర్ఎస్ ప్రవీణ్ వ్యాఖ్యానించారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారు.. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని అన్నారు. ఇప్పటికే తాను క్షమశిక్షణ కమిటీని ఆదేశించాను.. ముందు రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అతి త్వరలోనే రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని చెప్పారు. మార్వాడీలు మనలో ఒకరు.. వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదన్నారు. కాగా, తెలంగాణలో మార్వాడీ గో బ్యాక్, గుజరాతీ గో బ్యాక్ ప్రచారం మొదలైన విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ నేతలు ఫైర్ అవుతున్నారు. హిందూ సమాజాన్ని చీల్చే కుట్రలో భాగంగా ఈ ప్రచారం తెరమీదకు తెస్తున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. కమ్యునిస్టులు ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం చేస్తున్న డ్రామాలివంటూ బండి సంజయ్ ఫైర్ అయ్యారు.

# తెలుగు రాష్ట్రాలు రెండు కళ్లన్నావు ఏమాయె..

## చంద్రబాబుకు ఎమ్మెల్సీ అద్దంకి కౌంటర్

మొదటి పేజీ తరువాయి

గోదావరి, కృష్ణా, పెన్నా జలాలు తీసుకెళ్లే హక్కు ఉందని మీరు పోరాడుతున్నప్పుడు.. కృష్ణా మీద మా వాటా గురించి మేం పోరాడితే.. అది వారికి వ్యతిరేకమనడం అవివేకమని అన్నారు. భవిష్యత్తులో కృష్ణా, గోదావరి జలాల వివాదం రాకూడదంటే మళ్లీ నీళ్ల పున: పంపకాలు జరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు.కాగా, విజయవాడ లోని మున్సిపల్ స్టేడియంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తాము నిర్మించ తలపెట్టిన బనకచర్లతో ఏ రాష్ట్రానికీ నష్టం ఉండబోదని స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. సముద్రంలోని వృథాగా పోయే నీటిని మాత్రమే వినయోగిస్తున్నామని అన్నారు. ఎగువ రాష్ట్రాల వరద నీటితో తాము నష్టాలను భరిస్తున్నామని కామెంట్ చేశారు. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరమేంటని ప్రశ్నించారు. వరదను భరించాలి కానీ.. ఆ నీటిని వాడుకొవొద్దా అని చంద్రబాబు అన్నారు.

# సరోగసి ముసుగులో శిశు కొనుగోలు

మొదటి పేజీ తరువాయి

'సరోగసి పేరుతో ఒక్కో జంట నుంచి 20 నుండి 30 లక్షలు వరకు వసూలు చేశాము. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేశాము. అబార్షన్ కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణీలను గుర్తించి వారికి డబ్బులు ఆశ చూపాము. ప్రసవం తర్వాత వారి పిల్లల్ని కొనుగోలు చేసాము. ఎంతో మంది పిల్లలు లేని దంపతులకు సరోగసి ద్వారా పుట్టిన పిల్లలుగా నమ్మించాం. మొదట మహారాణిపేట పోలీస్ స్టేషన్లో నా మీద కేసు నమోదు అయింది. ఆ తరువాత వైజాగ్ టూ టౌన్, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు.. గుంటూరు కొత్తపేటలో మరో కేసు నమోదయింది. 2020లో మహారాణిపేటలో నమోదైన కేసులో రిమాండ్ వెళ్లి వచ్చాను. పిల్లల్ని కొనుగోలు చేయడంలో సంజయ్ తో పాటు సంతోషి కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్ సెంటర్లో సూపర్వైజర్ కం ఫార్మసిస్ట్ గా కృష్ణ, రిసెప్షనిస్ట్ గా పద్మ, టెలికాల్స్ గా అర్చన మేరీ, సోనా, నర్సుగా సురేఖ, ల్యాబ్ టెక్నీషియన్ గా ప్రభాకర్ ఉన్నారు' అని కన్ఫెక్షన్ రిపోర్టులో నమ్రత వెల్లడించారు.

'వైజాగ్ సెంటర్లో మేనేజర్ గా కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్ గా రమ్య ఉన్నారు. విజయవాడలో డాక్టర్ మధులత, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ కరుణ కీలకంగా ఉన్నారు. అనస్తీషియా డాక్టర్ గా గాంధీ ఆస్పత్రికి చెందిన సదానందం కీలకంగా ఉన్నారు. డబ్బు మొత్తాన్ని వివిధ బ్యాంకులకు బదిలీ చేశాను. సరోగసి కేస్ షీట్లు మొత్తాన్ని ఎవరు ముట్టుకోకుండా భద్రంగా దాచాను. నా కన్సల్టెన్సీ రూమ్లో ప్రత్యేక బాక్సులో భద్రపరిచాను. గోపాలపురంలో ఫిర్యాదు చేసిన రాజస్థాన్ దంపతుల కేసులో సరోగసి ద్వారా బిడ్డను ఇస్తానని నమ్మించాను. జూబ్లీహిల్స్ లోని ప్రముఖ ఆస్పత్రికి అబార్షన్ కోసం వచ్చిన దంపతులను మా ఏజెంట్లు డబ్బుకు ఒప్పించారు' అని కన్ఫెక్షన్ రిపోర్టులో నమ్రత తెలిపారు.

# ఆడంబరాలకు పోయి అప్పులపాలు కావొద్దు .. ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్, వర్ని, చందూర్, మొస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఇరవై ఆరు లక్షల నలభై మూడు వేల ఐదు వందల రూపాయల విలువైన 26,43,500/- చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆడబిడ్డలు భారం కాకూడదని ఒక్కొక్కరికి ఒక లక్ష ఒక వంద పదహారు రూపాయలు, ప్రభుత్వం అందిస్తుందని, ఆడంబరాలకు పోయి అప్పులపాలు కావద్దని ఉన్నంతలో ఘనంగా పెళ్లి జరిపించాలని కోరారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల,వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, ఏజస్, మోహన్ నాయక్, గోపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జలీల్, హకీమ్, బాన్సువాడ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారింది



**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** రైతుల పాలిట కాంగ్రెస్ పాలన శాపంగా మారిందని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జై జవాన్, జై కిసాన్ నినాదాలను ఈ దేశ ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ నినాదాల ద్వారా ఈ దేశం అభ్యున్నతి, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కట్టుబడి పనిచేయాలో, రైతు శ్రేయస్సు, వ్యవసాయరంగం ఎంత కీలకమైందో స్వాతంత్ర్య ఫలాలు అందుకోవడం అంటే వ్యవసాయరంగ అభివృద్ధి అని ఆ స్ఫూర్తి యొక్క లక్ష్యం. ఈ నినాదం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ సంధర్భంగా జరుగుతున్న 79వ స్వాతంత్ర్య వేడుకల సమయంలో జై కిసాన్‌లు నై యూరియా అని రోడ్ల మీదకు వచ్చి చెప్పులు లైన్లో పెట్టి ఒక్క బస్తా యూరియా కోసం పాట్లు పడుతున్నారు. ఆధార్ కార్డులు తీసుకుని వెళ్లి రోజుల తరబడి లైన్లో ఉంటే భార్యాభర్తలకు కలిపి ఒక్కటే బస్తా యూరియా ఇస్తున్నారు అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ యూరియా అనేది వారు మరో చోట అమ్ముకునేది కాదు. బ్లాక్ మార్కెట్ చేసేది కాదు. కానీ కాంగ్రెస్ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా నమ్మి ఓట్లేసినందుకు రైతుల ఆశలు అడియాసలయ్యాయి. దిక్కుతోచని స్థితిలో రాష్ట్ర రైతాంగం ఉన్నది.. యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఈ రాష్ట్రం కూరుకుపోయింది. కేటాయించిన కోటా ఇచ్చామని కేంద్రం చెప్పి చేతులు దులుపుకుంటుంది.. కేంద్రానికి లేఖలు రాసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది ? మరి యూరియా ఎక్కడకు పోయింది అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు..? దేశంలోని, ప్రపంచంలోని అన్ని విషయాల మీద మాట్లాడే ఈ ఎంపీలు రైతులకు యూరియా విషయంలో ఎందుకు మాట్లాడడం లేదు. గతంలో ఉల్లిగడ్డల కొరత మీద సెటైర్లు వేసేది.. తాజాగా తెలంగాణలో యూరియా కొరత నేపథ్యంలో బస్తా బహుమతిగా ఇచ్చి రైతులు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ పరిస్థితి వచ్చినందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలి. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రి రోజూ నోటికి వచ్చింది మాట్లాడుతున్నారు. వీరంతా సిపాయిలు అయితే రైతులకు యూరియా అందించడంలో ఎందుకు విఫలం అవుతున్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వరి 45.21 లక్షల ఎకరాలలో సాగయింది. పత్తి 44.64 లక్షల ఎకరాలలో సాగయింది. ఇతర పంటలు 18.64 లక్షల ఎకరాలలో, ఉద్యానపంటలు 9.34 లక్షల ఎకరాలలో మొత్తం 117.83 లక్షల ఎకరాలలో ఈ వానాకాలంలో పంటలు సాగవుతున్నాయి. గత ఏడాది 66.78 లక్షల ఎకరాలలో వరి వేశారు. రాష్ట్రంలో గత ఏడాదికంటే 22 లక్షల ఎకరాలలో వరి సాగు తగ్గిపోయింది. మొత్తం పంటల విస్తీర్ణం ప్రకారం గత ఏడాదికన్నా 10 లక్షల ఎకరాలలో సాగు తగ్గింది. బీఆర్ఎస్ హయాంలో 2022లో అన్ని పంటలు కలిపి వానాకాలంలో 1.35 కోట్ల ఎకరాలలో సాగయ్యాయి. అప్పట్లో ఇదే 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అన్ని పంటలకు సక్రమంగా సరఫరా చేశాం. ఇప్పుడు 22 లక్షల ఎకరాలలో వరి సాగు తగ్గినా యూరియా ఇవ్వలేకపోవడం సర్కారు ఘోర వైఫల్యం కాదా ? చేతగానితనం కాదా ? దీనికోసమే ప్రజలు మీకు ఓట్లేశారా ? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# రేవంత్ రెడ్డికి విషం ఎక్కువ.. విషయం తక్కువ

## ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

మొదటి పేజీ తరువాయి

నిర్మాణ రంగం కుదేలయింది. వాళ్లకు స్వాంతన చేకూర్చే మాట ఒక్కటి రేవంత్ ప్రసంగంలో లేదు. రేవంత్ రెడ్డికి విజన్ లేదు.. విజ్డం లేదు. ఎంత సేపు కేసీఆర్‌ను తిట్టడం, చంద్రబాబును పొగడటం తప్ప ఆయనకు ఏదీ చేత కాదు. హైదరాబాద్ అనేది రెవెన్యూ ఇంజిన్. నిర్మాణ రంగం బాగుంటేనే అన్నీ బాగుంటాయి. కేసీఆర్, కేటీఆర్‌ల చొరవతో హైదరాబాద్ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. హైదరాబాద్ ఇమేజ్ రేవంత్ పాలనలో డ్యామేజీ అయ్యింది. జీహెచ్ఎంసీలో భవన నిర్మాణ అనుమతులు తగ్గిపోయాయి. హెచ్ఎండీఏలో కార్యకలాపాలు పడకేశాయి. రేరాను అడ్డం పెట్టుకుని రేవంత్ బిల్డర్లను బెదిరిస్తున్నారు అని దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు.హైదరాబాద్ సైబరాబాద్‌గా మారడానికి 30 ఏండ్లు పట్టింది. రేవంత్ ఫ్యూచర్ సిటీ తెస్తానంటున్నాడు. అప్పటి దాకా హైదరాబాద్‌ను ఎండబెడతారా..? చంద్రబాబును పొగడుతున్నాడు. కేసీఆర్, కేటీఆర్ కృషిని రేవంత్ ఎందుకు ప్రస్తావించరు?రేవంత్ గుండె మీద చేయి వేసుకుని ఆత్మ విమర్శ చేసుకోవాలి. కేసీఆర్ ఉన్నప్పుడు బర్కత్ ఉంటుండే. రేవంత్ రెడ్డి అడుగుపెట్టాడో లేదో ప్రజల దగ్గర పైసలు పుట్టడం లేదు. రాష్ట్ర ఆర్థిక రంగ దుస్థితికి ఏకైక కారకుడు రేవంత్ రెడ్డి మాత్రమే అని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ఎన్ని భవనాలకు అనుమతి ఇచ్చారని తాను ఈ ఏడాది మే 7వ తేదీన ఆర్టీఐకి దరఖాస్తు చేసుకుంటే అర్థం పర్థం లేని సమాధానాలు ఇచ్చారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్ఆర్ ట్యాక్స్ కట్టనిదే ఏ పర్మిషన్ ఇవ్వడం లేదు. అనుమతులు పూర్తిగా అవినీతిమయం అయ్యాయి. రేవంత్ రెడ్డికి కుడి చేయిగా రేరా, ఎడమ చేయిగా హైడ్రా మారి ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నాయని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు.

# కాళేశ్వరం ఒక నీతి, పోలవరానికి మరో నీతా?

**న్యూస్ డెస్క్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు "పోలవరంను.. కూలవరం" అనే దమ్ము ధైర్యం ఉందా..? అని అడిగారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్డీఎస్ఏను దించి బీఆర్ఎస్‌పై బురదజల్లిన బీజేపీ నేతలు.. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారు..? ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర?త్వమే అని కేటీఆర్ మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు లేదు, పలుకూ లేదు. మరోసారి ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ.. జై కాళేశ్వరం.. అని కేటీఆర్ నినదించారు.

# వ్యక్తిగత పగ కోసం పదవిని వాడను..

## శత్రువులకు నా గెలుపే అసలైన శిక్ష

మొదటి పేజీ తరువాయి

దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు.శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక తత్వవేత్త అని అన్నారు సీఎం రేవంత్. పుస్కకావిష్కరణలకు తాను వెళ్లేది తక్కువ అని.. అందెశ్రీ ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చానని చెప్పారు. పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ తెలంగాణ అని అన్నారు రేవంత్. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ తన లక్ష్యమని చెప్పారు సీఎం.

# జి యన్ రావుకు మరో రెండు అవార్డులు



**ఖమ్మం టౌన్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** ది హిందూ సీనియర్ ఫోటోజర్నలిస్టు కు జి యన్ రావుకు 186 వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఫోటోగ్రఫీ ఫోటీలల్లో ప్రధమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాడు. ఈ విషయాన్ని విజయవాడలో ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ .లక్ష్మీశ శని వారం ప్రకటించారు. ఇప్పటికే గత రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి వారి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో ఫోటో జర్నలిజం లో బెస్ట్ ఫోటోగ్రఫీలో గోల్డ్ మెడల్ తో పాటు క్యాష్ అవార్డ్ గెలుచుకుని ఉన్నాడు. తిరిగి మరో రెండు అవార్డులు శనివారం రావటం చాల అభినందనీయం. ఆంధ్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పర్యాటక, సాంస్కృతిక రంగాలతో పాటు ఉత్తమ ప్రెస్ ఫొటోలతో మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగింది. ఈపోటీల్లో మొత్తం 186 ఫొటో ఎంట్రీలు రాగా వీటిని ఆరుగురు సభ్యులతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఎంట్రీలను పరిశీలించి విజేతలను ఎంపిక చేసారు. మొదటి విభాగమైన స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో జీఎన్ రావుకు ప్రథమ అవార్డును గెలుచుకున్నారు. రెండో విభాగంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు చెందిన ఫొటోల్లో జీఎన్ రావు ద్వితీయ అవార్డు లభించింది. ఈ అవార్డులను ఈ నెల 19 న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా విజయవాడలో అందుకోనున్నారు. ఈ సందర్భముగా జి యన్ రావు మాట్లాడుతూ అనతి కాలంలోనే ఒక గోల్డ్ మెడల్, ఫస్ట్ అండ్ సెకండ్ రావటం ఎంతో ఆనందముగా ఉందని జి ఎన్ రావు అన్నారు.

## ఖమ్మం బిజెపి కార్యాలయంలో వాజపేయి 6వ వర్ధంతి

### వాజ్ పేయి మాటలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచాయి

### బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం టౌన్,16 ఆగష్టు (కెరటం న్యూస్):** మాజీ ప్రధాని, దేశ రాజకీయాలలో



కవిసహృదయ నేతగా గుర్తింపు పొందిన అటల్ బిహారీ వాజపేయి 6వ వర్ధంతి సందర్భంగా శనివారం ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, వాజపేయి భారత రాజకీయాలను సేవామార్గంలో నడిపించిన మహానేత అని కొనియాడారు. "రాజకీయాలు అధికార సాధనం కాదు, సేవా సాధనమే కావాలి" అని ఆయన చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచాయని గుర్తుచేశారు. దేశ సమగ్ర అభివృద్ధికి దారితీసిన పొఖ్రాన్ అణు పరీక్షలు, గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారి ప్రాజెక్టులు వాజపేయి దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. వాజపేయి వ్యక్తిత్వం, వాక్చాతుర్యం, కవిత్వం, ప్రజాస్వామ్యానికి ఆయన చూపిన కట్టుబాటు ఆయనను ప్రపంచ నాయకుడిగా నిలబెట్టిందని కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఆయన కలల భారత్ సాధనలో బీజేపీ కార్యకర్తలు తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య , వేరేల్లి రాజేష్ ,మేకల నాగేందర్, ఆర్ వి ఎస్ యాదవ్, గడిల నరేష్, వాకదాని రామకృష్ణ , జ్యోతుల యుగంధర్, రుద్రగాని మాధవ్, తోడుపునూరి రవీందర్, శ్రీ రామనేని, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, పాలేపు రాము, బండ్ల రీగన్, కుమిలి శీను, అప్పారావు తదితరులు పాల్గొని వాజపేయి సేవలను స్మరించారు.

## శుక్రవారం కుర్చీ వేయలేదని అలక..
## శనివారం కలెక్టర్‌పై సెటైర్లు..



**కడప ,16 ఆగష్టు (కెరటం న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తనకు కుర్చీ ఇవ్వలేదని హంగామా చేసిన ఉదంతంపై కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి తాజాగా స్పందించారు. కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో స్టేజిపై తనకు కుర్చీ వేయలేదని మాధవిరెడ్డి అలిగి.. అరగంటసేపు నిల్చొని వెళ్లిపోయారనే వార్త నిన్న వైరల్‌గా మారింది. తనకు సరైన మర్యాదలు చేయలేదని జేసీ అతిథి సింగ్‌పై కోప్పడ్డ వీడియో కూడా సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే దీనిపై మాధవి రెడ్డి తాజాగా వివరణ ఇచ్చారు.

కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు తనను ఆహ్వానించారని మాధవి రెడ్డి తెలిపారు. అధికారుల ఆహ్వానం మేరకే తన కుటుంబసభ్యులతో కలిసి వెళ్లానని పేర్కొన్నారు. ఈ వేడుకలకు నాతో పాటు జిల్లాలోని పెద్దలు, విద్యాసంస్థల అధినేతలు, కుల, మత పెద్దలను ఆహ్వానించారని.. ఆ జాబితాకు సంబంధించిన వారికి కలెక్టర్, కలెక్టరేట్ సిబ్బంది ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కానీ నిన్న స్వాతంత్ర్య వేడుకలకు వెళ్లే.. అక్కడ అతిథులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన స్థలంలో కూర్చునే అవకాశం లేదని చెప్పారు. మొత్తం కలెక్టరేట్ సిబ్బంది, పోలీసు అధికారులు, వాళ్ల సిబ్బందే ఆ కుర్చీల్లో కూర్చున్నారని వివరించారు. వారిని లేపించి తాను కూర్చోవడం పద్ధతి కాదని అనిపించిందని.. అందుకే నిల్చుని కార్యక్రమాన్ని వీక్షించి వెళ్లిపోయానని స్పష్టం చేశారు.

ఇంత పెద్ద వేడుకకు అతిథులను పిలిచి.. వారు కూర్చోవడానికి వీలులేని విధంగా అరెంజ్‌మెంట్స్ చేసినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు అని వ్యంగ్యంగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారుల కుటుంబసభ్యులు చేసుకునే కార్యక్రమంగా, వాళ్ల పండుగగానే భావించి అక్కడి నుంచి వెనుదిరిగానని వెటకారంగా చెప్పారు. దీన్ని చాలా గొప్పగా ఆలోచించి, సోషల్‌మీడియాలో అంత సమయం కేటాయించి పెద్ద చర్చ చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అని ఎద్దేవా చేశారు.

# మున్నేరు వరద నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

## అనుదీప్ దురిశెట్టి

## వరద ప్రవాహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం బ్యూరో,16 ఆగష్టు (కెరటం న్యూస్):** ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదతో మున్నేరు వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. మున్నేర నది పరివాహక ప్రాంతాల ముందస్తు జాగ్రత్తల కోసం శనివారం ఖమ్మం నగరంలోని కాల్వొఒడ్డు, మున్నేరు ఘూట్, గణేష్ నిమర్జన ఘూట్, మంచికంటినగర్, బొక్కలగడ్డ, ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్, కేబీఆర్ నగర్, గ్రీన్ కాకతీయనగర్ తదితర ప్రాంతాలలో మున్సిపల్ కమీషన్ అభిషేక్ ఆగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ పర్యటించారు. మున్నేరు బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని, నీటి క్రమమట్టం లెవల్ లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్నేరు పరిసర ప్రాంతాలు బొక్కలగడ్డ, మంచికంటి నగర్ ఇంటింటికి తిరుగుతూ స్థానిక ప్రజలతో కలెక్టర్ ముచ్చటిస్తూ ఎగువ జిల్లాల నుండి మున్నేరు వరద పెరుగుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలని, అధికారులకు సహాకరించాలని, వరద ఎప్పటికప్పుడు గమనించుకోవాలని సూచించారు. మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సంబంధిత విభాగాలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుకి వరద ముప్పు పెరుగుతుందని, ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 15 అడుగుల మేర ప్రవహిస్తోందని మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉన్నామని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాల్లో తిరగవద్దని కోరారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో పూర్తి సంసిద్ధతతో స్థానికంగా ఉంటూ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున మున్నేరు నది, బ్రిడ్జిల పైకి ప్రజలు అనవసరంగా రావద్దని సూచించారు. వరద ఉన్న నేపథ్యంలో నీటి వనరులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతిం చవద్దని, దీనికి సంబంధించి తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితులను సైతం తట్టుకునేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సర్థార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ ఎంపీ వద్దిరాజు



**మహబూబాబాద్ బ్యూరో,16 ఆగష్టు (కెరటం న్యూస్):** సర్థార్ సర్వాయి పాపన్న గౌడ్ తాడిత, పీడిత బహుజనుల పక్షాన నిలబడి వారి న్యాయమైన హక్కుల సాధనకు పోరాడిన యోధుడు అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కొనియాడారు.మన తెలంగాణ గడ్డ ఖిలాషాపురంలో జన్మించిన పాపన్న గౌడ్ పెత్తందార్ల దౌర్జన్యాలు ,అణచివేతలకు వ్యతిరేకంగా సమన్యాయం, సమానత్వం కోసం పోరాడిన ధీశాలి అని ఎంపీ రవిచంద్ర చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ వద్ద నెలకొల్పిన సర్థార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎంపీ రవిచంద్ర లోకసభ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత తదితర ప్రముఖులతో కలిసి శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పుట్టిన గడ్డ, బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన సామాజిక విప్లవకారుడు పాపన్న గౌడ్ స్ఫూర్తితో రాజ్యాధికారమే లక్ష్యంగా, ధ్యేయంగా ముందుకు సాగుదామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిలో నోటికొచ్చిన హామీలిచ్చి, మాయమాటలు చెప్పి బహుజనుల ఓట్లు వేయించుకున్నారన్నారు. వృద్ధాప్య పింఛన్లను 2,000 నుంచి 4,000 రూపాయలకు, వైన్స్, బార్లలలో గౌడన్నలకు ఉన్న 15% రిజర్వేషన్లను 25% పెంచుతామని కాంగ్రెస్ నాయకులు హామీనివ్వడాన్ని గుర్తు చేశారు. ఈవిధంగా చెప్పుకుంటూపోతే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో అలవికాని వాగ్దానాలెన్నో చేసిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీసీలు, మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందిగా కోరుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014లోనే తీర్మానించి కేంద్రానికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు ప్రస్తావించారు. తమ బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా బడుగు జీవులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పక్షపాత పార్టీ అన్నారు. తమిళనాడులో మాదిరిగా బీసీ రిజర్వేషన్లను పెంచుతూ పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగం 9వ షెడ్యూల్ లో పొందుపర్చిన తర్వాతే అవి అమలవుతాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. ఈ వాస్తవం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకులు బీసీల ఓట్ల కోసం కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఆర్భాటంగా హామీనిచ్చి, ఇప్పుడు మోసపు మాటలు చెబుతున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. సర్వాయి పాపన్న వారసత్వం పుణికిపుచ్చుకున్న గౌడన్నలు ఇతర బీసీ కులాలు, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేసేందుకు ఇదే సరైన సమయమన్నారు. పాపన్న గౌడ్ పోరాట పటిమ,"అదొక్కటే ముగింపు" అని తన ఆత్మకథలో బహుజనులకు దిశానిర్దేశనం చేసిన పుంజాల శివశంకర్ లను స్ఫూర్తిగా తీసుకుని మనమందరం రాజ్యాధికారమే శ్వాసగా, లక్ష్యంగా, ధ్యేయంగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుదామని ఎంపీ వద్దిరాజు బహుజనులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షులు జేరిపోతుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న, కోశాధికారి బిక్కి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు ఎంపీ రవిచంద్రను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను ప్రదానం చేశారు. వేలాది మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి విజయసారథి, ఏం.వీ.రమణ, ఆకుల గాంధీ, శీలంశెట్టి వీరభద్రం, ఆకుతోట ఆదినారాయణ, పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, జెన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి, బొమ్మగాని ప్రభాకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.



# ఆ ఐదుగురు స్టార్స్‌కు నో ప్లేస్..

# గిల్ కూడా డౌటే!



స్పోర్ట్స్ న్యూస్,16 ఆగస్టు (కెరటం న్యూస్):యూఏఈ వేదికగా 2025 ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనుంది. టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీ మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్ మధ్య జరగనుంది. భారత్ తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఆగస్టు 19 లేదా 20న భారత జట్టును ప్రకటించే అవకాశముంది. ఆసియా కప్‌లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోనే భారత్ బరిలో దిగడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ అటుంచితే.. శుభ్‌మన్ గిల్‌కు చోటు కూడా దక్కకపోవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.

టీ20 జట్టులో ప్రయోగాలు చేయడానికి బీసీసీఐ సెలెక్టర్లు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. ఇటీవలి ఇంగ్లండ్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుతంగా రాణించినా.. ఆసియా కప్ 2025లో మాత్రం ఆడే అవకాశం దక్కకపోవచ్చని సమాచారం. ఇటీవలి రోజుల్లో అన్ని ఫార్మాట్లకు గిల్‌నే కెప్టెన్‌గా చేస్తారనే వార్తలొచ్చాయి కానీ.. ప్రస్తుతానికి సారథ్య మార్పు ఉండకపోవచ్చని సమాచారం. స్టార్స్ యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లకు స్థానం అనుమానమే. జైస్వాల్‌ను టెస్టు క్రికెట్‌పైనే దృష్టి కేంద్రీకరించమని బీసీసీఐ సెలక్టర్లు కోరారట.


భారత టీ20 జట్టులో ప్రస్తుతం సంజు శాంసన్, అభిషేక్‌శర్మలు ఓపెనర్లుగా రాణిస్తున్నారు. తిలక్‌వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాలతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. కీపర్స్ జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్‌లలో ఒకరికి అవకాశం దక్కనుంది. ఆపై ఆల్‌రౌండర్‌లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ బరిలోకి దిగనున్నారు. కృనాల్ పాండ్యా పేరును కూడా బీసీసీఐ సెలెక్టర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025లో పెద్దగా ప్రభావం చూపించని రింకు సింగ్‌కు కూడా ఆసియా కప్‌లో అవకాశం కష్టమే. అలానే ఐపీఎల్ స్టార్ సాయి సుదర్శన్ కూడా డౌటే. మొత్తానికి ఐదుగురు స్టార్స్‌కు చోటు కష్టంగానే కనిపిస్తోంది. పేస్ కోటాలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఆడడం ఖాయం. మూడో సీమర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మహమ్మద్ సిరాజ్ విశ్రాంతి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. మరి కొన్ని రోజులు ఆగితే.. ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టుపై పూర్తి స్పష్టత రానుంది.

# టీ20 అంటే కేవలం బాదుడు కాదు.. అందుకే గిల్ ఉండాలి: హర్భజన్



స్పోర్ట్స్ న్యూస్,16 ఆగస్టు (కెరటం న్యూస్):ఆసియా కప్ జట్టును ప్రకటించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మరో నాలుగైదు రోజుల్లో స్క్వాడ్ ప్రకటన ఉండనుంది. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తన అంచనాను ప్రకటించాడు. ఇందులో భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తోపాటు అనూహ్యంగా రియాన్ పరాగ్‌కు చోటివ్వడం గమనార్హం. “టీ20లు అంటే కేవలం బాదుడు కాదు. పరిస్థితికి తగ్గట్టుగా ఆడాలి. శుభ్‌మన్ గిల్‌ను తీసుకోవడానికి కారణం ఉంది. అతడు బంతిని బాదాలని అనుకుంటే ఏ హిట్టర్‌కూ తక్కువ కాదు. అలాగే మైదానం నలువైపులా బంతిని పంపించడం అతడి స్పెషాలిటీ. ఐపీఎల్‌లో చూస్తే ప్రతి సీజన్‌లోనూ గిల్ భారీగానే పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్‌నూ సొంతం చేసుకున్నాడు. కేవలం 120 స్ట్రైక్‌రేట్‌తో మాత్రమే కాకుండా.. 160తో పరుగులు రాబట్టాడు. అందుకే, గిల్‌కు టీ20 జట్టులో చోటు ఇవ్వాల్సిందే. కేఎల్ రాహుల్ చాలా మంచి ఆటగాడే. కానీ, అతడిని తీసుకోవడంలేదు. వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌నే తీసుకుంటా. ఒకవేళ అతడు లేకపోతే మాత్రం కేఎల్ సరైన ఆప్షన్” అని భజ్జీ వెల్లడించాడు.

# విశ్వంభర టీజర్ సిద్ధం



మూవీ న్యూస్,16 ఆగష్టు (కెరటం న్యూస్): కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘విశ్వంభర’. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు టీజర్‌ను సిద్ధం చేసింది చిత్ర బృందం. దీన్ని చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇది ఆధ్యాత్మిక అంశాలతో నిండిన సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోంది. త్వరలోనే విడుదల తేదీపైనా స్పష్టత ఇవ్వనున్నారు. ఇక మరోవైపు చిరు పుట్టినరోజు సందర్భంగానే అనిల్ రావిపూడి సినిమా టైటిల్ కూడా బయటకు రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

# పుట్టినరోజున మైల్‌స్టోన్ మూవీ అనౌన్స్‌మెంట్.. నాగ్ లుక్ కూడా సిద్ధం?



మూవీ న్యూస్,16 ఆగష్టు (కెరటం న్యూస్): తన కో స్టార్స్ చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటే.. కింగ్ నాగార్జున మాత్రం గట్టి కంబ్యాక్ కోసం కష్టపడుతున్నారు. 2022లో వచ్చిన బంగార్రాజు తర్వాత నాగ్ పెద్దగా హిట్ చూడలేదు. బ్రహ్మాస్త్ర హిట్ అయినప్పటికీ అది రణబీర్, అమితాబ్ బచ్చన్ ఖాతాలోకి చేరిపోయింది. ఆ తర్వాత వచ్చిన ది గోస్ట్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా.. నా సామి రంగా పర్లేదనిపంచింది. కింగ్ హీరోగా కాస్త బ్రేక్ ఇచ్చి.. సపోర్టింగ్ అండ్ స్పెషల్ రోల్స్‌కు షిఫ్టయ్యారు.

నాగార్జున ఇటీవలే ధనుష్ ‘కుబేర’తో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ ‘కూలీ’తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ సినిమాలో నాగ్ విలన్‌గా నటించారు. అయితే కింగ్ కొత్త సినిమా విషయంలో మాత్రం క్లారిటీ రావడం లేదు. కానీ ఇప్పటికే నాగ్ కొత్త సినిమాపై గట్టిగా కసరత్తులు చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళ దర్శకుడితో మైల్‌స్టోన్ మూవీ చేయబోతున్నట్టుగా తెలుస్తోంది. ‘రా.కార్తీక్’ దర్శకత్వంలో నాగార్జున సినిమా చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ‘కింగ్ 100’ వర్కింగ్ టైటిల్‌తో మొదలు పెట్టబోతున్నారు.లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను నాగ్ తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం. మరి ఈసారి కింగ్ ఎలాంటి సబ్జెక్ట్‌తో వస్తారో చూడాలి.

## ‘రామాయణ’లో తన పాత్ర గురించి.. సన్నీ డియోల్ ఇంట్రస్టింగ్ కామెంట్స్



మూవీ న్యూస్,16 ఆగష్టు (కెరటం న్యూస్): భారతీయ పౌరాణిక గాథల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన మహాకావ్యం ‘రామాయణం’. ఈ అద్భుత గాథ ఆధారంగా రూపొందుతున్న బాలీవుడ్ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ ‘రామాయణ’ ఇప్పటికే భారీ అంచనాలను సృష్టించింది. దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో తెరక్కెకుతున్న ఈ పాన్‌వరల్డ్ మూవీ 45కి పైగా భాషల్లో విడుదల కాబోతోంది. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అటు ఇండియన్ ఆడియెన్స్, ఇటు ఇంటర్నేషనల్ మార్కెట్‌లోనూ భారీ క్రేజ్ నెలకొంది. కాగా ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతున్నారు. అయితే ఈ సినిమాలో సన్నీడియోల్ తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు .‘ఈ మూవీలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. చాలా గౌరవంగా భావిస్తున్నాను. నా రోల్ చాలా సరదాగా, అల్లరిగా, ఉత్సాహంగా ఉంటుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాళ్లతో కూడుకున్నవే అయినా.. పూర్తిగా లీనమై నటించడానికి సిద్ధంగా ఉన్నాను. నా షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది, ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు మొత్తం టీమ్ ఎంతో కష్టపడుతోంది. హాలీవుడ్ స్థాయిలో ఎలాంటి రాజీ లేకుండా ఈ సినిమాను నిర్మిస్తున్నారు, రామాయణం లాంటి మహాకావ్యం ఎన్నిసార్లు తెరకెక్కించిన కొత్తదనమే ఉంటుంది, ఈ సినిమాతో ప్రపంచం మరోసారి రామాయణం గొప్పతనాన్ని ఆస్వాదిస్తుంది’ అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.